క్లుప్తంగా

ఎన్‌హెచ్‌ఆర్సీ మండలాధ్యక్షుడిగా దామోదర్



నియామక పత్రం అందుకుంటున్న దామోదర్

చిన్నశంకరంపేట(మెదక్): జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్‌హెచ్‌ఆర్సీ) చిన్నశంకరం పేట మండల అధ్యక్షుడిగా సిరిగద్దె దామోదర్‌ను ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మెగుళ్ల భద్రయ్య, జిల్లా అధ్యక్షుడు సాయిప్రసాద్‌లు నియామక పత్రం అందించారు. అలాగే మండల ప్రధాన కార్యదర్శిగా పుట్టి అనిల్‌కుమార్ (టీ.మాందాపూర్), ఉపాధ్యక్షుడిగా మంగలి లక్ష్మణ్(అంబాజీపేట)కు కూడా నియామక పత్రాలు అందజేశారు.

కళాకారులకు ప్రోత్సాహం



కళాకారులను సన్మానిస్తున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రాచీన కళలను కాపాడుతున్న కళాకారులను గ్రామస్తులు మంగళవారం సన్మానించారు. మండల పరిధి పిల్లుట్లలో 16 నుంచి 18 వరకు ఎల్లమ్మ కథపై కళాప్రదర్శన చేపట్టనున్నారు. ఆ ప్రదర్శన కోసం సాధన చేస్తున్న కళాకారులను కాంగెస్ నాయకుడు మురళీగౌడ్ సన్మానించి నగదు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శంకర్, సతీశ్, నర్సింహులు, హనుమంతు తదితరులు ఉన్నారు.

51 మందికి చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న రాజిరెడ్డి తదితరులు

నర్సాపూర్: సీఎం సహాయనిధి నుంచి 51 మందికి మంజూరైన చెక్కులను మంగళవారం అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన నివాసంలో మాట్లాడుతూ నర్సాపూర్, హత్నూర తదితర మండలాలకు చెందిన లబ్ధిదారులకు రూ. 23.87 లక్షల విలువైన చెక్కులు అందజేశామన్నారు. ఆయన వెంట నాయకులు రాజుయాదవ్, మల్లేష్, హబీబ్‌ఖాన్, అశోక్‌గౌడ్, వెంకటేష్, సురేష్ నాయక్, నగేష్, సుధీర్‌గౌడ్, రవిగౌడ్, మహెష్‌గౌడ్, కృపాచారి, నరేందర్‌రెడ్డి, రషీద్, అజ్మత్ తదితరులు ఉన్నారు.


ఉత్సవాల్లో పాల్గొన్న రఘునందన్



పూజా కార్యక్రమంలో ఎంపీ రఘునందన్

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని పోతంశెట్టిపల్లి లోగల శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి,పెద్దమ్మ తల్లి జాతర మహోత్సవాల్లో మంగళవారం మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్,మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాపగారి రమేష్ గౌడ్ నర్సాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ సురేష్, మండల మాజీ అధ్యక్షుడు దయాకర్ గౌడ్, మెదక్ పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, జిల్లా బీజేవైఎం అధ్యక్షులు సతీష్ ,ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిష్ట మహోత్సవానికి ఆహ్వానం



ప్రభుత్వ సలహాదారుడికి ఆహ్వానపత్రిక అందిస్తున్న శివకుమార్‌గౌడ్

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి గూడూర్‌లో నూతనంగా నిర్మించిన గురుపీఠంలో ప్రతిష్టించనున్న సాయిబాబా, దత్తాత్రేయ విగ్రహాల ప్రతిష్టాపన మహోత్సవానికి రావాలని పలువురికి మంగళవారం శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్ ఆహ్వానపత్రిక అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సలహాదారుడు హర్కర వేణుగోపాల్‌తోపాటు ప్రముఖులకు ఇచ్చారు. వచ్చే నెల 3 నుంచి 5 వరకు ఉత్సవాలు జరుగనున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి దారేది?

ప్రగతికి నోచుకోని నార్సింగి
- అద్దెగదుల్లో సర్కారు కార్యాలయాలు
- అసంపూర్తిగా నూతన నిర్మాణాలు
- మండలమైనా అభివృద్ధికి దూరం
- పట్టించుకోని అధికారులు



పిల్లర్ల స్థాయిలోనే ఆగిపోయిన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం

చిన్నశంకరంపేట(మెదక్): పదివేల పైచిలుకు జనాభా ఉన్న మండల కేంద్రం నార్సింగి. జిల్లాలోనే పెద్ద గ్రామంగా పేరున్నప్పటికీ అభివృద్ధిలో మాత్రం వెనుకబడింది. 44వ జాతీయ రహదారిపై ఉన్న నార్సింగి అభివృద్ధిలో ముందుండి.. ఇప్పుడు పట్టణాలుగా మారిన ఎన్నో గ్రామాలకు ఒకప్పుడు వ్యాపార కేంద్రమైంది. మండలమైనా అభివృద్ధికి నోచుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుంటుపడిన అభివృద్ధి

నార్సింగి గ్రామంలో అభివృద్ధి కుంటుపడింది. 10 వేల జనాభా, 6 వేలపైగా ఓటర్లు ఉన్నారు. ఐదేళ్ల క్రితం మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీ నిధులు ఏటా రూ.75 లక్షల బడ్జెట్‌తో ఉంది. కానీ, అభివృద్ధి పనులు మాత్రం ముందుకు సాగడంలేదు. దీంతో అనేక ప్రభుత్వ శాఖలకు కార్యాలయ భవనాలు కరువయ్యాయి. అప్పట్లో ఉన్న పెద్దాస్పత్రి ఇప్పుడు పీహెచ్‌సీగా మారింది. పశువైద్యశాల శిథిలమైంది. దీంతో బీసీ హాస్టల్‌లో ఒక గదిని పశువైద్యశాలగా మార్చారు. ప్రాథమిక పాఠశాలలోని ఒక చిన్న గదిని గ్రంథాలయంగా మార్చడంతో చదువుకునే వీలు లేకుండా పోయిందని పాఠకులు వాపోతున్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు

నార్సింగి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పక్కా భవనం లేకపోవడంతో 15 ఏళ్లుగా జెడ్పీ పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్నారు. నూతన భవనం కోసం నిధులు మంజూరైనప్పటికీ నిర్మాణం ముందుకు సాగడం లేదు. ప్రాథమిక పాఠశాల భవనం శిథిలం కాగా.. నూతన భవనం పనులు ఐదేళ్లుగా పిల్లర్ల స్థాయి నుంచి ముందుకు కదలడం లేదు. దీంతో ఉర్దూ పాఠశాల వరండాలో బోధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏడు అంగన్వాడీ కేంద్రాలుంటే ఐదు అద్దె గదుల్లోనే కొనసాగుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేసి అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తా..



నార్సింగి గ్రామ పంచాయతీకి ఏటా అన్ని రకాల నిధులు కలిపి రూ.కోటి వస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగితే అన్ని రంగాల్లో అభివృద్ధి చేయవచ్చు. గ్రామపంచాయతీ నిర్వహించే సాధారణ పనులు సాఫీగా జరుగుతున్నప్పటికీ శాశ్వత నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక అందించి అభివృద్ధికి కృషి చేస్తా.

–నాగభూషణం, ఈఓ, నార్సింగి

ఘనంగా వీరభద్రుడి జాతర



జలాభిషేకానికి నీటిని తీసుకెళ్తున్న భక్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో గుట్టపై వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రుడి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలో భాగంగా స్వామి వారికి అభిషేకం, అర్చనతో పాటు పందిరి వేయడం, గ్రామంలో నుంచి జలకడువలతో ఊరేగింపుగా వెళ్లి వీరభద్రుడికి అభిషేకం చేశారు. రాత్రి అగ్ని గుండాల ప్రవేశం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ ఈశ్వరప్ప, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు కల్యాణోత్సవం..

ఉత్సవాల్లో భాగంగా బుధవారం భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు చైర్మన్ బస్వరాజ్ తెలిపారు. ఈ వేడుకల్లో మంత్రి దామోదర రాజనర్సింహ హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ ఆస్పత్రి తనిఖీ చేసిన వైద్యాధికారులు



నిజాంపేటలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న వైద్యాధికారులు

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల కేంద్రంలోని ఓ శ్రీనివాస్ నర్సింగ్ హోమ్‌ను జిల్లా వైద్యాధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా అన్ని రిపోర్టులను సేకరించి డీఎంహెచ్‌ఓకు పంపించారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ అధికారి సుజన మాట్లాడుతూ గతంలో ఈ ఆస్పత్రిపై అనేక ఆరోపణలు వచ్చిన మేరకు తనిఖీలు చేపట్టామన్నారు. తదుపరి విచారణ చేపట్టిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి అనిల్, డాక్టర్ హరిప్రియ, శ్రీనివాస్, సూపర్‌వైజర్లు వెంకటేశ్వర రావు, కొండయ్య, రామారావు పాల్గొన్నారు.

చెరువు మట్టి చేలకు బలం



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పనుల్లో భాగంగా ఆయా గ్రామాల్లోని చెరువుల్లో పూడిక తీసిన మట్టి పంటచేలకు బలమని ఈజీఎస్ ఏపీఓ సంతోష్‌కుమార్ అన్నారు. కట్టెలవెంకటాపూర్‌లో పూడికతీత పనులు, జమ్లానాయక్‌తాండా, బూర్గుపల్లిలో ఫీడర్‌ఛానల్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరుశాతం, మస్టర్లను పరిశీలించి, కూలీలకు పనులపై అవగాహన కల్పించారు. ఆయన వెంట టీఏలు, ఎఫ్‌ఏలు తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ రమాదేవి



కొనుగోలును పరిశీలిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

మెదక్ ఆర్‌డీఓ రమాదేవి

చిన్నశంకరంపేట(మెదక్):ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని మెదక్ ఆర్‌డీఓ రమాదేవి అధికారులను ఆదేశించారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించి కొనుగోళ్ల తీరును, ట్యాబ్ ఎంట్రీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండ ధాన్యం కాంటాను వేగవంతం చేయాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ మన్నన్ తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

నర్సాపూర్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్, జిల్లా సలహాదారుడు చంద్రశేఖర్ మంగళవారం మండలంలోని పలు కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పలు కేంద్రాల్లో హమాలీల కొరత కారణంగా ధాన్యం తూకం పనులు నిదానంగా సాగుతున్నాయని, సరిపడా వాహనాలు రానందున తూకం వేసిన వడ్ల బస్తాలు అక్కడే ఉండిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడి పరిస్థితులను కలెక్టర్ సందర్శించి సమస్యలను పరిష్కరించేలా చూడాలని కోరారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

మనోహరాబాద్(తూప్రాన్): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇక్కట్లు కాకుండా సేకరణ చేయాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. మంగళవారం మండలంలోని దండుపల్లి వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని సూచించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడూ కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

పెద్దమ్మ ఆలయంలో చోరీ

రామాయంపేట(మెదక్): మండలంలోని రాయిలాపూర్ పెద్దమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయం తాళాలు పగులగొట్టి హుండీ ధ్వంసం చేసి సుమారు రూ.లక్షన్నర నగదుతోపాటు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు.

గ్రామాల్లో ఎక్సైజు తనిఖీలు

నర్సాపూర్: గ్రామాలలో తనిఖీలు నిర్వహించినట్టు స్థానిక ఇన్‌చార్జి ఎక్సైజు సీఐ గోపాల్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రమైన శివ్వంపేటతో పాటు మండలంలోని గోమారం, సికింద్లాపూర్, చండి గ్రామాలలో తనిఖీలు చేసినట్లు ఆయన చెప్పారు. గోమారంలో అక్రమంగా మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఒకరిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వదినపై మరిది దాడి

నర్సాపూర్ రూరల్: భూ వివాదంలో వదినపై మరిది దాడి చేసిన ఘటన నర్సాపూర్ మండలం లింగాపూర్ పంచాయతీ పరిధిలోని జగ్గయ్య తండాలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. జగ్గయ్య తండాకు చెందిన పట్లోత్ శ్రీను అన్నాదమ్ముళ్ల మధ్య తలెత్తిన భూ వివాదంలో సొంత అన్న కిషన్ భార్య శోభపై దాడి చేసి గాయపరిచాడు. కుటుంబ సభ్యులు శోభను నర్సాపూర్ ఏరియా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై నర్సాపూర్ ఎస్సైని వివరణ త్వరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చోరీకి గురైన ఆభరణాలు అప్పగింత

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి గ్రామంలోని దుర్గామాత ఆలయంలో చోరీకి గురైన బంగారు, వెండి అభరణాలను రికవరీ చేసిన పోలీస్‌లు మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అప్పగించారు. గతేడాది సెప్టెంబర్ 11న చోరీ జరుగగా నెల రోజుల్లోనే అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్న పోలీస్‌లు ఆభరణాలు రికవరీ చేశారు. ఆభరణాలను కోర్టు అనుమతితో తీసుకొచ్చిన పోలీస్‌లు ఆలయ కమిటీ సభ్యులకు అప్పగించారు. ఆభరణాలను అమ్మవారికి అలంకరణ చేసిన ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామాయంపేట సీఐ వెంకటరాజంగౌడ్, ఎస్‌ఐ నారాయణగౌడ్‌లను సన్మానించి సత్కరించారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

హోటల్ యజమానికి రూ.10వేల జరిమానా



హోటల్ యజమానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

మెదక్ మున్సిపాలిటీ: కనీస నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వెంకటేశ్ హెచ్చరించారు. మంగళవారం మెదక్ పట్టణంలోని పలు హోటళ్లు, స్వీట్ హౌస్‌లు, బేకరీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వెల్‌కంబోర్డు ప్రాంతంలో గల నక్షత్ర గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో నిబంధనలు పాటించడం లేదని గుర్తించారు. దీంతో హోటల్ యజమానికి నోటీసులు ఇవ్వడంతోపాటు రూ.10వేల జరిమానా విధించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, శానిటేషన్ జవాన్లు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): ఫిట్స్‌తో పడిపోయిన వ్యక్తిని వెంటనే ఆస్పత్రికి తరలించి దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. మంగళవారం దుబ్బాక నియోజకవర్గ పర్యటన ముగించుకొని సాయంత్రం ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి తిరుగు ప్రయాణంలో మండలంలోని బీకొండాపూర్ మీదుగా వెళ్తున్నారు. గోవిందాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ ఫిట్స్‌తో బస్టాండ్ సమీపంలో కిందపడిపోయాడు. ఎమ్మెల్యే వెంటనే తన వాహనం ఆపి శ్రీనివాస్‌ను పరామర్శించి అంబుల్స్‌ను పిలిపించి వైద్యం కోసం దౌల్తాబాద్‌కు తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు ఫోన్‌లో సూచనలు చేశారు.

కానరాని కార్యదర్శి.. తెరుచుకోని పంచాయతీ



తెరుచుకోని ముప్పారం పంచాయతీ కార్యాలయం

అల్లాదుర్గం(మెదక్): సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో పంచాయతీల అభివృద్ధి కార్యదర్శులపై ఆధారపడింది. అయితే ఆ కార్యదర్శులు మొక్కుబడిగా వచ్చి వెళ్లి పోతున్నారు. ముప్పారం పంచాయతీ కార్యదర్శి మంగళవారం 11 గంటలు దాటినా విధులకు రాకపోవడంతో కార్యాలయం తెరుచుకోలేదు. పంచాయతీ కార్యదర్శికి ఫోన్‌చేసి ఆయన ఎక్కడ ఉంటే అక్కడికే వెళ్లాల్సి వస్తోందని పలు పనులపై వచ్చిన ప్రజలు వాపోతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, పంచాయతీ అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన కార్యదర్శులు ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదనే సాకుతో విధులకు ఎగనామం పెడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా విధులు నిర్వహించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో ఎంఈఓ వెంకటేశం

పెద్దశంకరంపేట(మెదక్): విద్యార్థులు వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వెంకటేశం అన్నారు. మంగళవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని పరిశీలించారు. విద్యార్థులు వేసిన డిజైనింగ్, డ్రాయింగ్, ఇంగ్లిష్ లెటర్స్‌లో శిక్షణ, యోగా తదితర అంశాలను పరిశీలించి సూచనలందించారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట్, ప్రభాకర్, లక్ష్మన్, ఆనంద్, సిబ్బంది సంపత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేద్దాం



నర్సాపూర్‌లో సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నర్సాపూర్ రూరల్: దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు అన్ని వర్గాల కార్మికులకు పిలుపునిచ్చారు. మంగళవారం నర్సాపూర్‌లో సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు వెంటనే కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హనుమంత్, ఖదీర్, శ్రీనివాస్, ప్రభాకర్, సుధాకర్, రవి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

‘ట్రిపుల్ ఆర్’ లాగానే నష్టపరిహారం చెల్లించాలి



ఆర్‌డీఓకు అభిప్రాయాలు తెలుపుతున్న రైతులు

నర్సాపూర్: ట్రిపుల్ ఆర్ కోసం సేకరిస్తున్న భూములకు ఇచ్చే విధంగానే ధరను తమకు కూడా చెల్లించాలని తిమ్మాపూర్ రైతులు డిమాండ్ చేశారు. శివ్వంపేట మండలం తిమ్మాపూర్ రైతు వేదికలో ఆర్‌డీఓ మహిపాల్ మంగళవారం సమావేశం నిర్వహించారు. సంగారెడ్డి రీచ్ 2 కెనాల్ కోసం భూములు కోల్పోతున్న రైతుల అభిప్రాయాలను స్వీకరించారు. అయితే ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి సేకరిస్తున్న భూములకు ప్రభుత్వం ఇస్తున్న ధరనే తమకు కూడా ఇవ్వాలని తిమ్మాపూర్ రైతులు ఆయనను కోరారు. సంగారెడ్డి రీచ్–2 కెనాల్ నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతులందరికీ ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డీఓ చెప్పారు. సమావేశంలో ఆర్‌డీఓ మహిపాల్‌తోపాటు శివ్వంపేట డిప్యూటీ తహసీల్దార్ షఫియొద్దీన్, ఆర్‌ఐ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

రామాయంపేట ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ కలేనా?

స్థల పరిశీలనకే పరిమితం
- పట్టణంలోకి రాకుండా నేరుగా వెళ్తున్న బస్సులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



రామాయంపేట ప్రస్తుత బస్టాండు

రామాయంపేట(మెదక్): ఒకప్పటి నియోజకవర్గ కేంద్రమైన రామాయంపేట పరిస్థితి నేడు దయనీయంగా మారింది. జాతీయ రహదారిని ఆనుకునే ఉన్న రామాయంపేట పట్టణంలోకి ఎక్స్‌ప్రెస్ బస్సులు రాకుండా నేరుగా వెళ్లిపోతుండటంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

రామాయంపేటకు గతంలో రోజూ రెండు వందలకుపైగా ఆర్టీసీ బస్సులు వచ్చేవి. కామారెడ్డి, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, నిర్మల్, అదిలాబాద్ డిపోలనుంచి హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులు గతంలో రామాయంపేట బస్టాండులోకి వచ్చేవి. ప్రస్తుతం ఈ బస్సులు పట్టణంలోకి రాకుండా జాతీయ రహదారి మీదుగా వెళ్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు హైదరాబాద్ వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. మేడ్చల్ డిపో ఆర్డినరీ బస్సులు మాత్రం నేరుగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి రామాయంపేటకు వస్తున్నాయి. దీంతో కొంతమేర ప్రయాణికులకు వెసులుబాటు కలిగింది. కానీ వివిధ పనుల నిమిత్తం హైదరాబాద్, ఇతర దూర ప్రాంతాలకు వెళ్తున్న వ్యాపారులు, స్థానికులు రాత్రివేళలో అష్టకష్టాలు పడుతున్నారు. రామాయంపేటలో ఆగాల్సిన బస్సులు సైతం జాతీయ రహదారి పైనుంచి వెళ్లిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు కామారెడ్డి టికెట్ తీసుకొని పట్టణ శివారులో జాతీయ రహదారిపై అక్కన్నపేట బ్రిడ్జి వద్ద బస్సు దిగి చీకట్లో కాలినడకన పట్టణంలోకి రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ విషయమై పట్టణ ప్రజలు, పలు గ్రామాల ప్రజలు పలుమార్లు ఆందోళనలు చేపట్టినా, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.

అమలుకాని హామీ..

2021లో అప్పటి ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ రామాయంపేట వచ్చిన సందర్భంగా స్థానిక ప్రజా ప్రతినిధులు ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ ఆవశ్యకతను వివరించి వినతిపత్రం అందజేశారు. దీంతో ఆయన బస్టాండు నిర్మాణానికి జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్థలాన్ని పరిశీలించారు. నాలుగేళ్లు దాటుతున్నా పనులు మొదలు కాలేదు. ఈ విషయమై అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.